క్లుప్తంగా

కార్మికులు లేబర్ కార్డు పొందాలి



లేబర్ కార్డు దారులకు మెడికల్ రిపోర్టులు అందజేస్తున్న అధికారులు

కుల్కచర్ల: ప్రతి కార్మికుడు లేబర్‌కార్డు పొందాలని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, రజక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మోత్కురు వెంకటేశ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో కార్మిక శాఖ ఆధ్వర్యంలో లేబర్‌కార్డు కలిగిన వారికి వైద్యపరీక్షలు నిర్వహించి, రిపోర్టులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. లేబర్‌కార్డు పొందటం వలన ఏదైనా ప్రమాదం జరిగినా, వారి పిల్లల వివాహం జరిగినా కార్మిక శాఖ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందుతుందని తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారి గౌతమ్, పీల్డ్ అసిస్టెంట్ రాంజీ, నాయకులు వెంకట్రాములు, రమేష్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలి

అల్లూరి జయంతి, వివేకానంద వర్ధంతిలో వక్తలు



అల్లూరి చిత్రపటం, వివేకా విగ్రహానికి నివాళి అర్పిస్తున్న యువత

కుల్కచర్ల: మహనీయులను యువత ఆదర్శంగా తీసుకొని, వారి అడుగుజాడల్లో నడవాలని పీఎస్‌పీఎస్, వివిధ సంఘాల నేతలు సూచించారు. మంగళవారం మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి, వివేకానంద వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటాలు, విగ్రహాలకు యువత, నేతలు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో మైపాల్, హరి, ముకుంద, శ్రీశైలం, భగత్, చారి తదితరులు పాల్గొన్నారు.

ట్యాబ్‌లతో విద్యాబోధన



ట్యాబ్ ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయురాలు

కొడంగల్ రూరల్: ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు ట్యాబ్‌ల ద్వారా విద్యాబోధన చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఈ మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలో కొడంగల్, బొంరాస్‌పేట ప్రాథమిక పాఠశాలలకు చెందిన పలువురు ఉపాధ్యాయ సిబ్బందికి, జిల్లా ఉన్నతాధికారులు ట్యాబ్‌లను అందజేశారు. ట్యాబ్‌ల ద్వారా విద్యార్థులకు చక్కటి అవగాహన కలుగుతుందని, సులభంగా నేర్చుకోవడానికి ఆసక్తి చూపుతున్నారని పాతకొడంగల్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం క్రాంతికుమార్ తెలిపారు.

ఘనంగా పాండురంగస్వామి ఉత్సవాలు



పాండురంగ స్వామిని ఊరేగిస్తున్న భక్తులు

పెద్దేముల్: గురు పౌర్ణమి సందర్భంగా మంగళవారం మండల కేంద్రంలో పాండురంగ స్వామి దేవాలయం వద్ద పల్లకీ సేవ, ఉట్టి కొట్టే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పాండురంగ దేవాలయం నుంచి ఆంజనేయ స్వామి ఆలయం వరకు భక్తులు పాండురంగనుకి పల్లకీ సేవ చేసి, ఉట్టి కొట్టారు. అనంతరం భక్తులకు ఉత్సవ కమిటీ సభ్యులు అన్నదానం చేశారు.

టీడీపీ పరిగి ఇన్‌చార్జిగా కాసాని వీరేష్



పరిగి: తెలుగుదేశం పార్టీ పరిగి నియోజకవర్గ ఇన్‌చార్జిగా కాసాని వీరేష్‌ను నియమించినట్లు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ తెలిపారు. ఈ మేరకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వీరేష్ మాట్లాడారు. పార్టీకి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు నిరంతరం కృషి చేస్తానని, నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ.. వారి సమస్యలపై పోరాటం చేస్తానని చెప్పారు.

ఎక్కడి చెత్త అక్కడే!





మూలన పడిన చెత్త తరలించే ఆటోలు (ఇన్‌సెట్‌లో) సాయిపూర్ మార్గంలో పేరుకు పోయిన చెత్త

- మూలన పడ్డ ఆటోలు, ట్రాక్టర్లు
- మరమ్మతుకు నోచుకోని వాహనాలు
- వార్డుల్లో పేరుకు పోతున్న చెత్త
- ఆందోళన చెందుతున్న ప్రజలు
- పట్టించుకోని మునిసిపల్ అధికారులు

తాండూరు టౌన్: 36 వార్డులు.. ఆరు ఆటోలు, ఆరు ట్రాక్టర్లు.. ఇదీ తాండూరు మున్సిపల్ పరిధిలో చెత్త తరలించేందుకు వాడుతున్న వాహనాల సంఖ్య. అంటే ఒక్కో వాహనం మూడు వార్డుల్లో రోడ్లపై ఉన్న చెత్తను సేకరించాల్సి ఉంటుంది. ఇది సాధ్యమయ్యే పనేనా? వీలైనంత మేర ఎత్తేసి మిగిలిన చెత్తను అలాగే వదిలేస్తున్నారు. వాహనాలు లేకపోతే తామేమీ చేయలేమంటూ పారిశుద్ధ్య కార్మికులు చేతులెత్తేస్తుండగా.. పాడై పోయిన వాహనాలను మరమ్మతు చేయించాలనే ఆలోచన అధికారులకు లేకుండా పోయింది. ఫలితంగా మునిసిపాలిటీలో పారిశుద్ధ్యం లోపించింది.

రోడ్డు మీదకు చిమ్మేస్తూ..

తాండూరు పట్టణంలో సుమారు లక్షకు చేరువలో జనాభా ఉంది. నిత్యం టన్నుల కొద్దీ చెత్త చెదారం పోగవుతూ ఉంటుంది. ఇళ్లల్లోని చెత్తను తడి చెత్త, పొడి చెత్త వేరు చేసి బుట్టల్లో వేసి, చెత్త సేకరించే మున్సిపాలిటీ వాహన సిబ్బందికి అందించాల్సి ఉంటుంది. కానీ.. ఈ విషయాన్ని పట్టణ ప్రజలు ఏనాడో మరిచిపోయారు. దీంతో చెత్తంతా రోడ్డు మీదకు చిమ్మేస్తూ జనాలు చేతులు దులుపుకొంటున్నారు. వీరికి తగినట్లుగానే మున్సిపల్ అధికారులు వ్యవహరిస్తున్నారు. కనీసం అధికారులు, సిబ్బందితో పనిచేయించాలనే విషయాన్ని స్థానిక ప్రజాప్రతినిధులైన కౌన్సిలర్లూ మరిచిపోయారు.

తుప్పు పడుతున్న కొత్తవాహనాలు

పట్టణంలో నిత్యం చెత్తను తొలగించాలంటే కనీసం 36 ఆటోలతో పాటు వాణిజ్య సముదాయాల్లో చెత్తను సేకరించేందుకు కనీసం 12 ట్రాక్టర్లు అవసరమవుతాయి. కానీ ప్రస్తుతం ఆరు ఆటోలు, ఆరు ట్రాక్టర్లు మాత్రమే పని చేస్తున్నాయి. రెండేళ్ల క్రితం కొత్తగా కొనుగోలు చేసిన 18 ఆటోలను రిబ్బన్ కత్తిరించి ప్రజాప్రతినిధులు అట్టహాసంగా ప్రారంభించారు. అయితే ఆ ఆటోలను నడిపేందుకు డ్రైవర్లను నియమించే అంశంలో అధికార పార్టీకి చెందిన ఇరు వర్గాల మధ్య ఏర్పడిన భిన్నాభిప్రాయంతో అవి నేటికీ రోడ్డెక్కలేదు. దీంతో పార్కింగ్ చేసిన ప్రాంతంలోనే అవి తుప్పుపట్టి పోతున్నాయి. ఆటోలకు మరమ్మతు చేయించి రోడ్డెక్కించాలని కొన్ని నెలల క్రితం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు మున్సిపల్ అధికారులు చెబుతున్నారు. కానీ అవి కార్యరూపం దాల్చడం లేదు.

సిబ్బంది కొరత..

కార్మికుల సమస్య ఇబ్బందికరంగా మారింది. వార్డుల్లోని చెత్త తొలగించేందుకు 224 మందికి పైగా కార్మికుల అవసరం ఉండగా.. కేవలం 168 మందే విధుల్లో ఉన్నారు. వీరిలో కొందరిని అధికారులు, ప్రజాప్రతినిధులు తమ వ్యక్తిగత పనుల కోసం వినియోగించుకోవడం విశేషం. ఇదిలా ఉండగా.. ఇటు సిబ్బంది కొరత, అటు వాహనాలు రోడ్డెక్కక వీధుల్లో చెత్తపేరుకుపోతోందని, అసలే సీజనల్ వ్యాధుల కాలమని, రోగాల బారిన పడతామని పుర ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పారిశుధ్య పనుల్లో జాప్యం జరగకుండా చూడాలని, రోడ్డుపై చెత్త వేస్తున్న వారి విషయంలో కఠినంగా వ్యవహరించాలని కోరుతున్నారు.

విద్యుత్ సమస్య పరిష్కరించండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఎమ్మెల్యే ఆనంద్

అనంతగిరి: విద్యుత్ సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ విద్యుత్ అధికారులను ఆదేశించారు. మంగళవారం మీతో నేను కార్యక్రమంలో భాగంగా వికారాబాద్ మున్సిపాలిటీ 26, 31 వార్డుల్లో పర్యటించారు. ప్రజా సమస్యల గురించి ఆరా తీయగా.. విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం కలుగుతుందని చెప్పారు. ఈ సందర్భంగా ట్రాన్స్‌కో అధికారులతో ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రస్తుతం ఉన్న ఫీడర్ నుంచి మార్చి మరో ఫీడర్ ద్వారా కరెంట్ సరఫరా చేయాలని ఆదేశించారు. 26వ వార్డులో పాత స్తంభాలు తొలగించి కొత్తవి ఏర్పాటు చేయాలని చెప్పారు. 31వ వార్డులో ట్రాన్స్‌ఫారం షిఫ్టింగ్ చేయాలని, అవసరమైన చోట కొత్త పోల్స్ ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, కౌన్సిలర్ గాయత్రి లక్ష్మణ్, సునీత రమేష్ గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ ముత్యంరెడ్డి, కౌన్సిలర్ అనంతరెడ్డి, కృష్ణారెడ్డి, సీనియర్ నాయకుడు విజయ్ కుమార్, డాక్టర్ భక్తవత్సలం, కాలనీ వాసులు పాల్గొన్నారు.

అంధకారంలో అటవీ కార్యాలయం

బిల్లు చెల్లించలేదని విద్యుత్ సరఫరా నిలిపివేత



అటవీశాఖ కార్యాలయం

కొడంగల్: నియోజకవర్గ కేంద్రం కొడంగల్ హెడ్ క్వార్టర్‌లో ఉన్న అటవీశాఖ రేంజ్ కార్యాలయంలో అంధకారం చోటుచేసుకుంది. కరెంటు బిల్లు చెల్లించలేదని ట్రాన్స్‌కో సిబ్బంది విద్యుత్ కనెక్షన్‌ను తొలగించారు. దీంతో మూడు రోజులుగా కార్యాలయం చీకట్లో మగ్గుతోందని, 72 గంటలు గడిచినా పట్టించుకునే వారు లేరని సిబ్బంది తెలిపారు. ఇదే విషయమై సిబ్బందిని వివరణ కోరగా.. సుమారు లక్ష రూపాయల వరకు కరెంటు బిల్లు బకాయి ఉందని, బిల్లులు జిల్లా కేంద్రానికి పంపించినట్లు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ఖజానాలో కాసులు నిండుకున్నాయని, అందుకే బిల్లులు చెల్లించడం లేదని వికారాబాద్ జిల్లా కేంద్రం నుంచి వర్తమానం వచ్చింది. చేసేది లేక కార్యాలయ సిబ్బంది ఖాళీగా కూర్చుని కాలక్షేపం చేస్తున్నారు.

కులవృత్తుల వారికి చేయూత



కుల వృత్తులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ శైలజారెడ్డి

ఎంపీడీఓ శైలజారెడ్డి

మోమిన్‌పేట: కులవృత్తుల వారికి ప్రభుత్వం చేయూతనందిస్తుందని ఎంపీడీఓ శైలజారెడ్డి అన్నారు. మంగళవారం మోమిన్‌పేట, ఏన్కతల గ్రామాల్లో దరఖాస్తుదారుల వద్దకు వెళ్లి, కులవృత్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మండల పరిధి 28 గ్రామపంచాయతీలలో 600మంది దరఖాస్తు చేసుకున్నారని, అందులో భాగంగానే వృత్తి దారులను పరిశీలిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. పరిశీలనలో కులవృత్తిలో లేని వారి అర్జీలను తిరస్కరించబడతాయని తెలిపారు. కుల వృత్తులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం రూ. లక్ష ఇస్తుందని ఎంపీడీఓ చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శులు నర్సింహులు, మైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య



పరిగి: దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూల మాలవేసి నివాళి అర్పిస్తున్న నాయకులు



తాండూరు రూరల్: కోత్లాపూర్‌లో..

పరిగి: భూమి కోసం, భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాటం చేసిన దొడ్డి కొమురయ్య.. తెలంగాణ ప్రజానీకానికి స్ఫూర్తిదాయకమని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య అన్నారు. మంగళవారం కొమురయ్య వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించి మాట్లాడారు. తెలంగాణ సాయుధ పోరాటం యోధుడు దొడ్డి కొమురయ్య అని, ఆయన పోరాట ఫలితమే తెలంగాణ సాధనకు బాటలు వేసిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు గోవింద్‌నాయక్, హబీబ్, సత్తయ్య, రఘురాం తదితరులు పాల్గొన్నారు.

తాండూరు రూరల్‌లో..

తాండూరు రూరల్: దొడ్డి కొమురయ్య వర్ధంతి సందర్భంగా కోటబాసుపల్లి, కోత్లాపూర్‌లో ఆయన చిత్రపటానికి పలువురు పూలమాల వేసి నివాళి అర్పించారు. జెడ్పీటీసీ గౌడి మంజుల, సర్పంచులు కుర్వ నాగర్జున, బుడ్డెల్లి సాయిలు, కురుమ సంఘం డివిజన్ అధ్యక్షుడు జగదీష్, ఆలయ కమిటీ చైర్మన్ సందీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో తిర్మలాపూర్



సర్పంచ్ కమ్లీబాయిని సన్మానిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి(ఫైల్)

- సొంత నిధులతో పల్లెను తీర్చిదిద్దిన సర్పంచ్
- కమ్లీబాయ్‌ను సన్మానించిన కలెక్టర్

పూడూరు: తిర్మలాపూర్ గ్రామ పంచాయతీ అభివృద్ధి పథంలో దూసుకుపోతోంది. ప్రభుత్వం కేటాయించిన నిధులే కాకుండా.. సర్పంచ్ కమ్లీబాయి సొంత డబ్బులతో గ్రామాన్ని తీర్చిదిద్దుతూ పాలనాధికారి మెప్పు పొందారు. గ్రామంలో అవసరం ఉన్న చోట సీసీరోడ్లు, సైడ్ డ్రైన్‌ల నిర్మాణంతో పాటు మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారు. క్రీడా ప్రాంగణం, స్మశాన వాటిక, నర్సరీ, డంపింగ్ యార్డులను నిర్మించారు. గ్రామంలో పేదింటి ఆడ బిడ్డల వివాహానికి పుస్తె మెట్టెలతో పాటు నగదును ఆర్థిక సహాయంగా అందజేస్తూ.. ఆ కుటుంబానికి అండగా నిలుస్తున్నారు.

అభినందించిన కలెక్టర్

గ్రామంలో బృహత్ పల్లె పకృతివనం ఏర్పాటు చేసి, ప్రభుత్వం పంపిణీ చేసిన మొక్కలే కాకుండా.. సొంత నిధులు వెచ్చించి పండ్లు, కూరగాయలు, ఔషధ, పూల మొక్కలు నాటించారు. మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణ చేపట్టి వనంలా తీర్చిదిద్దారు. ఈ నేపథ్యంలో గ్రామాన్ని సందర్శించిన కలెక్టర్ నారాయణరెడ్డి.. పచ్చదనంతో నిండిన పల్లెను చూసి సర్పంచ్ కమ్లీబాయిని అభినందించి, పూలమాలతో సత్కరించారు.

ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యం: సర్పంచ్

గ్రామాభివృద్ధే నా ధ్యేయం. జిల్లాలోనే గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతా. సొంత డబ్బులు ఖర్చు చేసి అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నా. అభివృద్ధితో పాటు సేవా కార్యక్రమాలు చేస్తున్నాం. నా వంతు సహాయ సహకారాలు పేదలకు అందిస్తున్నాను.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

మర్పల్లి: అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎంపీడీఓ రాజ్ మల్లయ్య అన్నారు. మంగళవారం మర్పల్లి మండలం మొగిలిగుండ్లలో ఉపాధిహామీ పథకం కింద రూ.20 లక్షలతో నిర్మిస్తున్న పంచాయతీ భవన నిర్మాణం పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్‌తో మాట్లాడారు. నిర్మాణం పనులను వేగవంతం చేయాలన్నారు. అంతకు ముందు కొంషెట్‌పల్లిలో నర్సరీలో పెంచుతున్న మొక్కలను ఆయన పరిశీలించారు. హరితహారంలో మొక్కలు నాటేందుకు ముందుగానే గుంతలు తీయించాలని ఉపాధి సిబ్బందిని ఆదేశించారు.

పార్టీ బలోపేతానికి కృషి

కుల్కచర్ల: బీజేపీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ తమిళనాడు నేత వి.టి. అరసు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బూత్‌స్థాయి కార్యకర్తలతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. అవకాశవాద రాజకీయాలకు, కుటుంబ పాలనకు విరుద్ధంగా.. దేశం, ధర్మం కోసమే బీజేపీ పనిచేస్తుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి పరుస్తూ.. ప్రజల అభ్యున్నతి కేంద్రం పాటుపడుతుందని చెప్పారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఘణపురం వెంకటయ్య, మాజీ సర్పంచ్ జానకీరాం, పార్టీ మండల అధ్యక్షుడు మైపాల్, బీజేవైఎం మండల అధ్యక్షుడు గడుసు మైపాల్, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు వెంకటయ్య, నాయకులు ఆంజనేయులు, రమేష్, బిచ్చయ్య పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

కుల్కచర్ల: పేదలకు అండగా ఉంటానని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు అన్నారు. మంగళవారం అంతారంలో మధుసూదన్ రెడ్డి అనే వ్యక్తి మృతిచెందారు. విషయం తెలుసుకున్న రామ్మోహన్ రెడ్డి స్థానిక నేతలతో ఆర్థిక సహాయంగా బాధిత కుటుంబానికి రూ.5వేలు అందజేశారు.

బంట్వారంలో..

బంట్వారం: కోట్‌పల్లి మండలం ఎన్కెపల్లికి చెందిన హనుమయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న స్వచ్ఛంద సేవా సంస్థ ఫౌండర్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు వడ్ల నందు తరఫున సంస్థ సభ్యులు.. మంగళవారం మృతుడి కుటుంబ సభ్యులకు రూ.5వేలు అందజేశారు.

బీజేపీలో అగ్రవర్ణాలకే పెద్దపీట

యాలాల: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా కిషన్‌రెడ్డికి రెండోసారి అవకాశం ఇవ్వడం, ఆ పార్టీ అగ్రవర్ణాలకే అధిక ప్రాధాన్యత ఇస్తుందనే ప్రచారాన్ని నిజం చేసిందని పార్టీ యాలాల మండల అధ్యక్షుడు కుర్వ మహిపాల్ ఆరోపించారు. ఈ మేరకు ఆయన మంగళవారం మాట్లాడారు. అధ్యక్షుడిగా బండి సంజయ్‌ని నియమించిన తరువాత పార్టీకి గల్లిగల్లిలో ఊపు వచ్చిందన్నారు. గతంలో కిషన్‌రెడ్డి అధ్యక్షుడిగా కొనసాగిన సమయంలో పార్టీని ఎలా నడిపారో అందరికీ తెలుసునని ఎద్దేవా చేశారు. బండి నాయకత్వంలో పార్టీకి ప్రజల్లో విశ్వాసం పెరిగే సమయంలో అధ్యక్షుడి మార్పు తమను ఎంతగానో కలిచివేసిందని పేర్కొన్నారు. త్వరలో పార్టీ అధ్యక్ష పదవికి రాజీనామా చేసి, పార్టీ సానుభూతిపరుడిగా కొనసాగుతానని మహిపాచెప్పారు.

నిరుపేదలకు అండగా ఉంటాం

కుల్కచర్ల: నిరుపేద ప్రజలకు అండగా ఉంటామని డీసీసీ అధ్యక్షుడు టి.రామ్మోహన్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో వారం రోజుల క్రితం వడ్ల చంద్రకళ అనే మహిళ అనారోగ్యంతో మృతి చెందారు. ఈ మేరకు మంగళవారం బాధిత కుటుంబీకులను ఆయన పరామర్శించారు. డీసీసీ ఉపాధ్యక్షుడు భీం రెడ్డి, బ్లాక్‌టు అధ్యక్షుడు భరత్‌కుమార్, కుల్కచర్ల ఎంపీటీసీ ఆనందం పాల్గొన్నారు.

మెపా జిల్లా గౌరవ అధ్యక్షుడిగా మొగులయ్య

తాండూరు రూరల్: మెపా (ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్) జిల్లా నూతన అధ్యక్షుడిగా ప్రభుత్వ ఉపాధ్యాయుడు సంగెం మొగులయ్యను ఎంపిక చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయనకు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముదిరాజ్‌ల అభివృద్ధికి పాటుపడతానని చెప్పారు.

బలపడుతున్న కాంగ్రెస్

- పార్టీలోకి పెరిగిన వలసలు
- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రఘువీరారెడ్డి



కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్ నాయకులు

ధారూరు: కాంగ్రెస్‌లోకి బీఆర్‌ఎస్ నాయకుల చేరికతో పార్టీ మరింత బలపడుతుందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రఘువీరారెడ్డి అన్నారు. మంగళవారం ధారూరు మండలం మోమిన్‌కలాన్ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్తలు, నాయకులు లతీఫ్, అఫ్రోచ్, రోషన్, ఖాజాపాష, ఇమ్రాన్, గౌసొద్దీన్, ఖాదర్, ముతాలిబ్ తదితర నాయకులు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరగా.. వారికి పార్టీ కండువా కప్పి రఘువీరారెడ్డి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిరుద్యోగులకు మొండిచేయి చూపిస్తుందని, ఉద్యోగ ప్రకటనలే తప్ప.. నియామకాలు చేపట్టడం లేదని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో ఓటు అనే ఆయుధంతో ఆ పార్టీకి ప్రజలు తగిన బుద్ధి చెప్పి, కాంగ్రెస్ పార్టీని ఆదరిస్తారని ఆశాభావం వ్యక్తంచేశారు. మాజీ జెడ్పీటీసీ పట్లోళ్ల రాములు, కాంగ్రెస్ నాయకులు మల్‌రెడ్డి, అబ్దుల్ రహమాన్, రాజ్ మహమ్మద్, బాబుమియా, బాలవర్ధన్‌రెడ్డి, యూసుఫ్, బలరాంరెడ్డి, బాలరాజు పాల్గొన్నారు.

న్యాయవాద వృత్తి చాలా గొప్పది



టీఆర్‌ఆర్‌ను సన్మానిస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

డీసీసీ అధ్యక్షుడు టి.రామ్మోహన్ రెడ్డి

పరిగి: సమాజంలో న్యాయవాద వృత్తి చాలా గొప్పదని డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి అన్నారు. పరిగి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో.. న్యాయవాదుల సంఘం నూతన భవనంలో టీఆర్‌ఆర్‌ను మంగళవారం అసోసియేషన్ సభ్యులు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అసోసియేషన్ అభివృద్ధికి తన సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని చెప్పారు. అదే లక్ష్యంతో గతంలో భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేశానని గుర్తుచేశారు. న్యాయవాదులు న్యాయం వైపు ఉండి పోరాటం చేస్తారని, పేద ప్రజలకు వారి అండ ఎంతో అవసరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు రాంచంద్రయ్య, న్యాయవాదులు లింగం, ఆనంద్, నరేందర్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ దేవతలకు బోనాలు



బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

కొడంగల్ రూరల్: కొడంగల్ మండలం చిన్ననంది గ్రామంలో మంగళవారం బోనాల పండుగ ఘనంగా జరిగింది. గ్రామ ప్రజలు నెత్తిన బోనంతో డప్పు చప్పుళ్లతో ఊరేగింపుగా.. గ్రామదేవతలైన ఊరడమ్మ, మైసమ్మల ఆలయాలకు చేరుకున్నారు. గుడి చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం దేవతామూర్తులకు బోనం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలతో పల్లెలు పచ్చగా ఉండేలా చూడు తల్లీ అంటూ వేడుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సావిత్రమ్మ, నాయకులు సాయిలు, రాములు, ఎల్‌ఐసీ విజయకుమార్, వెంకట్, మొగులప్ప, చిన్న, కృష్ణయ్య, సాయప్ప తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించండి



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ రవిగౌడ్

ఎస్‌ఐ రవిగౌడ్

కొడంగల్ రూరల్: సీసీ కెమెరాల ఏర్పాటుకు గ్రామస్తులు సహకరించాలని ఎస్‌ఐ రవిగౌడ్ కోరారు. మంగళవారం కొడంగల్ మండలం పెద్దనందిగామలో గ్రామస్తులతో మాట్లాడారు. అపరిచితులు, అనుమానాస్పదంగా ఎవరైనా కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని చెప్పారు. సీసీల ఏర్పాటుతో దొంగతనాలు, నేరాలను అరికట్టేందుకు ఆస్కారం ఉంటుందని, దాడులకు పాల్పడిన వారిని గుర్తించేందుకు ఉపయోగపడుతుందని తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ శారదమ్మ, మాజీ సర్పంచ్ సంజీవరెడ్డి, సత్యనారాయణరెడ్డి, ఏఎస్‌ఐ శ్రీహరి, గ్రామస్తులు పాల్గొన్నారు.

జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ఎంపీడీఓ ఉమాదేవికి వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

పూడూరు: గ్రామ పంచాయతీల్లో విధులు నిర్వహిస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం జీపీ కార్మికులతో ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం ఎంపీడీఓ ఉమాదేవికి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. జీఓ 60 ప్రకారం నిర్ణయించిన వేతనాలను ప్రభుత్వం ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మికుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి ఈ నెల 6న కార్మిక జేఏసీ ఆధ్వర్యంలో నిరవధిక సమ్మెను నిర్వహించనున్నామని తెలిపారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు శ్రీనివాస్, తిరుమలయ్య, ఆంజనేయులు, కృష్ణ, వెంకటయ్య, బందయ్య, కిష్టయ్య, నర్సింహులు, రమేష్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.